నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. సత్యం ఎన్‌క్లేవ్, పుల్లారెడ్డి స్వీట్ హౌజ్ ఏరియా, అన్షు అపార్ట్‌మెంట్స్, ఎన్‌సీఎల్ సింధు, వీబీ నందదీప్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

నూజివీడు సీడ్స్ ఫీడర్ పరిధిలో...

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. నూజివీడు సీడ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎంఎన్‌కే విటాస్ విల్లాస్, దూలపల్లి రోడ్డు, నాగార్జున హోమ్స్, నూజివీడు సీడ్స్ కంపెనీ, అశ్విన్ కాలనీ, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ అపార్ట్‌మెంట్స్, శాంతినికేతన్ విల్లాస్, అప్పలరాజు మహేంద్ర షోరూమ్, అపర్ణ–2 గేటెడ్ విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

వివేకానంద్‌కు సత్కారం


శుభాకాంక్షలు తెలుపుతున్న కృషి కాలనీ మాజీ అధ్యక్షుడు మజీద్ పాషా

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన వివేకానంద్‌కు గురువారం పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కృషికాలనీకి చెందిన మాజీ అధ్యక్షుడు మజీద్ పాషా ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. తనపై పూర్తి విశ్వాసంతో మరోసారి సేవ చేసేందుకు అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరి ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తానని పేర్కొన్నారు.

కేంద్రంలో ఏర్పడేది బీజేపీ ప్రభుత్వమే...

మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు


మురళీధర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నిజాంపేట్ బీజేపీ నాయకులు

నిజాంపేట్: కేంద్రంలో ఏర్పడేది బీజేపీ ప్రభుత్వమేనని, ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాల్లో ప్రజలిచ్చిన తీర్పే అందుకు నిదర్శనమని మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు అన్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ తిరిగి అధికారం చేజిక్కించుకున్న నేపథ్యంలో గురువారం నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన బీజేపీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ... తెలంగాణలో బీజేపీ బలోపేతమైందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డా. ఎంఆర్ఎస్ రాజు, శిల్పారెడ్డి, శీలం కృష్ణారెడ్డి, మైలారం అశోక్, రంగరాజు, కృష్ణప్రసాద్, చాడా శ్రీనివాస్, జశ్వంత్, ఏపీ శర్మ, శ్రీకాంత్, లక్ష్మణ్ కిశోర్, రమణయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గార్మీ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు


గార్మీ ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగద్గిరిగుట్ట: గార్మీ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని బీఆర్ఎస్ నాయకుడు జైహింద్ అన్నారు. గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ భగత్‌సింగ్‌మార్గ్‌లోని దర్గాలో శనివారం నిర్వహించనున్న గార్మీ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గార్మీ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు రషీద్, హజ్రత్ అలీ, ముస్లిం పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

దీపోత్సవం



సుభాష్‌నగర్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గురువారం సూరారం శివాలయనగర్‌లోని ఉమామహేశ్వర ఆలయంలో జ్యోతి లింగార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దీపోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.




ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిలిపిన ప్రైవేట్ వాహనాలు. (ఇన్‌సెట్‌లో) జలమండలి కార్యాలయ రోడ్డులో నిర్మించిన డివైడర్

ఖాళీ స్థలాలు.. పార్కింగ్ అడ్డాలు

ప్రభుత్వ ఖాళీ స్థలాలు కొందరికి కాసుల వర్షం కురిపిస్తున్నాయి.. సదరు స్థలాల్లో భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌లు నిర్వహిస్తూ లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు. వీరికి ప్రభుత్వ కిందిస్థాయి అధికారుల అండదండలు ఉండటంతో ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన నగదు వీరి జేబుల్లోకి చేరుతోంది. వివరాల్లోకి వెళ్తే రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీలోని కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయానికి ఆనుకుని సుమారు 8 ఎకరాల ఏపీహెచ్‌బీకి చెందిన ఖాళీ స్థలం ఉంది. – రంగారెడ్డినగర్

- డబ్బులు తీసుకుని భారీ వాహనాలకు పార్కింగ్
- ఎనిమిదెకరాల ఏపీహెచ్‌బీ స్థలంలో అక్రమ పార్కింగ్
- అక్రమార్కుల జేబుల్లోకి ప్రభుత్వ ఖజానా

సదరు స్థలాన్ని ప్లాటింగ్ చేయకుండా అలాగే ఉంచారు. ఈ నేపథ్యంలో ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన కొందరు వ్యక్తుల కళ్లు ఖాళీ స్థలంపై పడింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పరిశ్రమలు, ఇంజినీరింగ్ కళాశాలలు అనేక ఉన్నాయి. దీంతో సదరు కంపెనీల ఉద్యోగులను తీసుకెళ్లే ప్రైవేట్ వాహనాలు నిలిపేందుకు ఏపీహెచ్‌బీ కాలనీలోని ఖాళీ స్థలాన్ని తమ సొంత జాగీరుగా వాడుకుంటున్నారు. వందల సంఖ్యలో ప్రైవేట్ బస్సులను నిలిపే అడ్డాగా ఏపీహెచ్‌బీ స్థలాన్ని మార్చేశారు.


ఏపీహెచ్‌బీ స్థలంలో పార్క్ చేసిన బస్సులు

హెచ్చరిక బోర్డు ఉన్నా బేఖాతరు..

ఏపీహెచ్‌బీ కాలనీలోని హౌసింగ్ బోర్డు స్థలంలో ఎవరైనా ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారుల బోర్డును ఏర్పాటు చేసిన ఇవేమీ లెక్క చేయడం లేదు. పార్కింగ్‌లకు అద్దె వసూలు చేస్తున్న వారితో ఏపీహెచ్‌బీ కిందిస్థాయి అధికారులు కుమ్మక్కు కావడంతో ఈ విషయం ఉన్నతాధికారుల వరకు వెళ్లడం లేదు. దీంతో గత కొన్నేళ్లుగా వీరు ఆడిందే ఆటగా పాడిందే పాటగా మారింది..ఎవరైనా ఉన్నతాధికారులు ఈ విషయమై వాకబు చేస్తే సెలవు దినాల్లో నిలుపుతున్నారని చెబుతూ తప్పించుకుంటున్నారు.

ప్రతి నెలా లక్షల్లో ఆదాయం..

ఏపీహెచ్‌బీకి చెందిన 8 ఎకరాల స్థలంలో పార్కింగ్‌లకు అనుమతిస్తూ లక్షల్లో వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్థలంలో 150 నుండి 250 వరకు వ్యాన్‌లు మొదలుకుని బస్సులను నిలుపుతున్నారు. ఒక్కో వాహనానికి రూ.500 మొదలుకుని రూ.1000 వరకు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా నెలకు రూ.1.50 లక్షల నుంచి 2లక్షల వరకు తమ జేబుల్లో వేసుకుంటున్నారు. దీంతో ప్రతిఏటా భారీ మొత్తంలో ఏపీహెచ్‌బీ ఆదాయాన్ని కోల్పోతోంది.

అప్పనంగా వచ్చిన ఏపీహెచ్‌బీ సొమ్ముతో డివైడర్..

ఇటీవల ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయ మీదుగా రోడ్డును వేశారు. అయితే కాలనీ సొసైటీ సభ్యులు రోడ్డుకు డివైడర్ ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవించగా, ప్రధాన రోడ్లకు మినహా కాలనీ అంతర్గత రోడ్లల్లో డివైడర్లకు నిధులు వెచ్చించలేమని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో ఏపీహెచ్‌బీ కాలనీ ఆధ్వర్యంలోనే రూ.2 లక్షల పైచీలుకు నిధులు వెచ్చించి డివైడర్‌ను ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులతో ప్రారంభించారు. సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది అన్న చందంగా ఏపీహెచ్‌బీ స్థలంలోని అక్రమ పార్కింగ్‌ల ద్వారా వచ్చే సొమ్ముతో కాలనీ డివైడర్‌ను నిర్మించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ఏపీహెచ్‌బీ కాలనీలోని ఖాళీ స్థలంలో నిలుపుతున్న వాహనాలతో సరికొత్త సమస్య వచ్చి పడింది. చీకటి పడిందంటే చాలు వాహనాల మధ్య మద్యం బాబులు తిష్ట వేస్తున్నారు. అంతే కాకుండా కొందరు మత్తు పదార్థాలను సైతం సేవిస్తు అటుగా వెళ్లే వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సమీపంలో గుడెన్‌మెట్, ఆదర్శనగర్ కాలనీల వాసులు ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు.


ఏపీహెచ్‌బీ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సగం రోడ్డు నిర్మించి.. మిగతా సగం వదిలేశారు!

చింతల్: అధికారుల అనాలోచిత నిర్ణయాలు ప్రజలకు శాపంగా మారుతున్నాయి. ప్రణాళిక లోపంతో చేపట్టిన పనులు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. చింతల్ డివిజన్‌లో గత ఆరు నెలల క్రితం వేసిన ఓ రోడ్డే ఇందుకు నిదర్శనం. చింతల్ డివిజన్‌లోని స్టార్‌లైట్ అపార్ట్‌మెంట్ నుంచి భగత్ సింగ్‌నగర్‌కు ఉన్న దారి మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో స్థానిక నేతలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో రోడ్డును వేయాలని ప్రతిపాదించి కొంతమేర రోడ్డు వేసి గాలికొదిలేశారు.

రోడ్డు వేసి ఆరునెలలైనా..

స్టార్‌లైట్ అపార్ట్‌మెంట్ వెనుక నుంచి భగత్ సింగ్‌నగర్ వెళ్లే ఈ దారిలో ఆరు నెలల క్రితం సీసీ రోడ్డు వేశారు. ఈ రోడ్డును సగభాగమే వేయడంతో నిధులు వృథాగా పోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రణాళిక లోపంతో అంచనాలు రూపొందించి సగభాగం రోడ్డు వేసి మిగతా సగభాగంలో చెట్లు అడ్డుగా ఉన్నాయని గాలికొదిలేశారు. అధికారులు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా రోడ్డు వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆరు నెలలుగా మిగతా సగభాగంలో చెట్లు తొలగించి రోడ్డు వేసేలా చర్యలు ఎందుకు తీసుకోలేదంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే పలు బస్తీలకు వెళ్లేందుకు సులువుగా చేరుకునే వీలు కలుగుతుందని పేర్కొంటున్నారు.


స్టార్‌లైట్ వెనుక నుంచి వెళ్లే దారిలో ఆరు నెలల క్రితం రోడ్డు వేసి వదిలేసిన దృశ్యం

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో ఉచిత శిక్షణ


ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న ఎంఆర్‌సెట్, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రతినిధులు

సుభాష్‌నగర్: మల్లారెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంఆర్‌సెట్), మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ భారత ప్రభుత్వ రంగ సంస్థ మధ్య గురువారం పరస్పర అవగాహన ఒప్పందం జరిగింది. ఎంఆర్‌సెట్ కళాశాల తరఫున డైరెక్టర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, సీఎస్ఐ అకాడమీ వీఆర్వో రామ్మోహన్‌రావు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ ఒప్పందంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అదే విధంగా విద్యార్థులు, అధ్యాపకులు ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ ప్లాట్‌ఫామ్‌లో నైపుణ్యాలను పెంపొందించుకునే వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిమ్స్ కొత్త ఛైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి

- మొదటి నుంచి సీఎం ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైనం
- శుభాకాంక్షలు తెలిపిన నిమ్స్ ఉద్యోగ సంఘాలు

లక్డీకాపూల్: నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన ఛైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఇక నుంచి నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సీఎం రేవంత్ కొనసాగుతారు. బొక్కల దవాఖా నుంచి నిజాం వైద్య విజ్ఞాన సంస్థగా ఎదిగిన మొదలు నిమ్స్ ఛైర్మన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తూ వస్తున్నారు. అదే క్రమంలో గురువారం రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి నిమ్స్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సీఎంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈయన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్‌రావులు గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ క్రమంలో నిమ్స్ పారా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శిరందాస్, నిమ్స్ నాన్ ఫ్యాకల్టీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యగౌడ్, సురేష్ బాబులు కొత్త సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ హయంతో ఆస్పత్రి విస్తరణ అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

వివక్ష లేని సమాజ స్థాపనకు కృషి చేయాలి

జగద్గిరిగుట్ట: దళితులు, ఆదివాసీ స్త్రీలపై జరుగుతున్న హింసను రూపుమాపాలనే ఉద్దేశంతో ఈనెల 10వ తేదీ వరకు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు దళిత స్త్రీ శక్తి నేషనల్ కన్వీనర్ ఝాన్సీ తెలిపారు. గురువారం జగద్గిరిగుట్ట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, నెహ్రూనగర్‌లోని ఠాగూర్ హైస్కూల్, గాంధీనగర్‌లోని చైతన్య విద్యానికేతన్ స్కూల్, మగ్దూమ్‌నగర్‌లోని బాపూజీ హైస్కూల్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

- ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ.. విద్యను ఆయుధంగా మలుచుకుని బాగా చదవాలన్నారు. విష సంస్కృతికి దూరంగా ఉంటూ హింసకు వ్యతిరేకంగా, వివక్ష లేని సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. విద్యతోనే అన్ని అసమానతలు దూరమవుతాయని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ రేణుక, బాలమణి, వసుంధర, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కూతురిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల జైలు

జీడిమెట్ల: కన్నకూతురిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి మేడ్చల్ జిల్లా కోర్టు 20సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. వివరాల్లోకి వెళ్తే రంగారెడ్డినగర్ డివిజన్ వెంకటరాంరెడ్డినగర్ 2019 నవంబర్‌లో సునీల్‌సింగ్, సునైనా దంపతులు వారి నలుగురు పిల్లలతో కలిసి ఓ ఇంట్లో కిరాయికి ఉండేవారు. వారి కుమారుడు (9)కి ఫిట్స్ రావడంతో భార్యాభర్తలు కలిసి కుమారుడిని నిలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా మిగతా ముగ్గురు పిల్లలను సునీల్‌సింగ్ సోదరుడు అనీల్‌కుమార్ సనత్‌నగర్‌లోని తన ఇంటికి తీసుకువెళ్లాడు.

- మరునాడు సునీల్‌సింగ్ సనత్‌నగర్ వెళ్లి ముగ్గురు పిల్లలను తనతో పాటు ఇంటికి తీసుకువచ్చాడు. అతని భార్య సునైనా బాబుతో ఆస్పత్రిలోనే ఉంది. కాగా అదేరోజు రాత్రి సునీల్‌సింగ్ అతని పెద్దకుమార్తె(12)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. మరునాడు రాత్రి బాలిక(12) వారు ఉండే ఇంట్లో ఓ మహిళ వద్దకు వెళ్లి మీ ఇంట్లో పడుకుంటాను అని బతిమిలాడింది. బాలిక భయంతో ఉండటాన్ని గమనించిన మహిళ మరో ఇద్దరు మహిళలతో కలిసి ఏమి జరిగిందని బాలికను అడిగింది. బాలిక జరిగిన విషయాన్ని మహిళలతో చెప్పుకుంది.
- నవంబర్ 26న బాలికను తీసుకుని జీడిమెట్ల పీఎస్‌కు వెళ్లి మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ జరిపిన ఇన్‌స్పెక్టర్ పోక్సో, అత్యాచారంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి సునీల్‌సింగ్‌ను రిమాండుకు తరలించారు. గురువారం మేడ్చల్ కోర్టు సునీల్‌సింగ్‌కు 20సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది.

28 నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఈ నెల 28 నుంచి వివిధ డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం రెగ్యులర్ విద్యార్థుల ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల టైం టేబుల్, ఇతర వివరాలను ఓయూ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా డిగ్రీ కోర్సుల ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువును ఈ నెల 8 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 13 వరకు పొడిగించినట్లు తెలిపారు.

ప్రగతిభవన్ పేరు మార్చడం హర్షణీయం

పంజగుట్ట: ప్రగతిభవన్‌కు జ్యోతిబా పూలే ప్రజాభవన్‌గా పేరుమార్చడం హర్షణీయమని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. గత ప్రభుత్వం బీసీలు ఎదుర్కొంటున్న ఏ సమస్యనూ పరిష్కరించలేదని ఆయన ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చెయ్యగానే ప్రగతిభవన్‌ను జ్యోతిబా పూలే ప్రజాభవన్‌గా పేరు మార్చారని, ముమ్మందు బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.


వైభవంగా పడిపూజ


గోపీ గురుస్వామిని సత్కరిస్తున్న స్వాములు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని ప్రెసిడెన్సీ పార్కులో గురువారం అయ్యప్పస్వామి మహాపడి పూజా కార్యక్రమంలో అంగరంగ వైభవంగా జరిగింది. గోపీ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజలో పెద్ద ఎత్తున స్వాములు పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. అయ్యప్ప నామస్మరణ, భజనలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేసి ప్రసాదం అందజేశారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్



interview

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ అన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు కొత్తగా ఎల్‌టీ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని తెలిపారు. అదే విధంగా పాత బకాయిల విషయం తదితర అంశాలపై ఆయన 'సాక్షి'కి వెల్లడించారు.

ప్రశ్న: మెరుగైన విద్యుత్ సరఫరాకు ఎటువంటి చర్యలు చేపట్టనున్నారు.

జవాబు: బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో లోఓల్టేజీ సమస్య దాదాపు పరిష్కారమైంది. కొత్తగా ఏర్పడ్డ కాలనీలు, బస్తీల నేపథ్యంలో సమస్య తలెత్తకుండా కొత్తగా నాలుగు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు అయ్యాయి. వాటిని జీపీఆర్ లేఅవుట్, కేఆర్ సెట్ కాలనీ, వడ్డెర బస్తీ, రేణుక ఎల్లమ్మ కాలనీ ఏర్పాటు చేయనున్నాం.

ప్రశ్న: కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ బ్రేక్‌డౌన్ అవుతోంది. దానికి గల కారణం.?

జవాబు: బాచుపల్లి సెక్షన్ పరిధిలో 30 ఏళ్ల నాటి ఎల్‌టీ లైన్లే నేటికీ కొనసాగుతున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపగా 30 కిలోమీటర్ల మేర కొత్త ఎల్‌టీ లైన్లు మంజూరయ్యాయి. పాత 50 ఎంఎం ఎల్‌టీ లైన్ల స్థానంలో 64ఎంఎం ఎల్‌టీ లైన్‌ల రీకండక్టరింగ్ పనులు త్వరలోనే చేపడతాం. దీంతో బ్రేక్‌డౌన్ సమస్య తీరుతుంది.

ప్రశ్న: విద్యుత్ బకాయిలపై మీ సమాధానం..

జవాబు: ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు దాదాపుగా చెల్లించారు. కాని సాయినగర్, వడ్డెర బస్తీ, ఎస్సీ బస్తీల్లో రూ.14 లక్షల మేర బకాయిలు పేరుకుపోయాయి. తమ సిబ్బంది బకాయిదారులకు నోటీసులు జారీ చేశారు. వినియోగదారులు సైతం బకాయిలను చెల్లించేందుకు తమకు సహకరించాలి.

ప్రశ్న: బాచుపల్లి సెక్షన్ పరిధిలో ఫీడర్ల ఓవర్ లోడ్ సమస్యపై ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: పెరిగిన నివాసాల నేపథ్యంలో ఫీడర్లపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత సంవత్సరం నాలుగు కొత్త ఫీడర్లను ఏర్పాటు చేశాం. తాజాగా కొత్తగా ఫీడర్ల బైఫరికేషన్‌లో భాగంగా మల్లంపేట్, శ్రీహోమ్స్ కాలనీలో మరో రెండు ఫీడర్లు ఏర్పాటు చేయనున్నాం. అదే విధంగా లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.

ప్రశ్న: వర్షం పడ్డ ప్రతిసారి విద్యుత్ లైన్‌లు ట్రిప్ అవడానికి కారణం.?

జవాబు: చెట్ల కొమ్మలు తీగలపై పడటంతో ట్రిప్ అవుతోంది. తరచూ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తునే ఉన్నాం. కాని గాలులు వీచిన సమయంలో కొమ్మలు విరిగి తీగలపై పడుతున్నాయి. హరితవనం, సాయినగర్ కాలనీల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ట్రిప్ అయిన సమయాల్లో తమ సిబ్బందిని పంపి వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నాం.

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్


బాస్కెట్ బాల్ పోటీల్లో తలపడుతున్న పురుషుల జట్లు

నిజాంపేట్: నేడు క్రీడల్లో అనేక అవకాశాలున్నాయని చదువుతో పాటు క్రీడాల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రపంచ స్కేటింగ్ చాంపియన్, అర్జున్ అవార్డు గ్రహీత అనూప్ కుమార్ అన్నారు. బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాలలో 15వ అఖిల భారత ఓపెన్ ఇంజినీరింగ్ కాలేజీయేట్ స్పోర్ట్స్ ఫెస్ట్‌ను గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కళాశాల స్థాయిలో రాణిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయి జట్లకు ఎంపికయ్యే అవకాశముందన్నారు. విద్యార్థులు ఆ దిశగా పట్టుదలతో కృషి చేసి కళాశాలు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కళాశాల ప్రధాన కార్యదర్శి జేఎస్ రావు మాట్లాడుతూ... క్రీడల్లో గెలుపొటములు సహజమన్నారు. ప్రతి ఒక్కరూ తమ సామర్థ్యానికి తగ్గట్టుగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడు, డాక్టర్ చెన్నకేశవరావు, పీఈటీలు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న మహిళా జట్లు